
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.2; కనిష్ఠం 19.1







జిల్లాలో ఓ వైపు వానాకాలం సీజన్‌కు సంబంధించిన వరి కోతలు జరుగుతుండగానే మరోవైపు రైతులు యాసంగి సీజన్ సాగు పనులు మొదలు పెట్టారు. వరిసాగుకు సంబంధించి పొలం దున్నే పనులు ముమ్మరం చేశారు. సాగుకు అవసరమైన ఎరువులు విత్తనాలు సమకూర్చుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. అధికారులు సైతం రైతులకు రుణాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మొదలైన యాసంగి

- సాగుకు సిద్ధమవుతున్న జిల్లా రైతులు
- పంట రుణాలను అందించేందుకు అధికారుల ఏర్పాట్లు
- ఈ సీజన్‌లో మొత్తం రూ.1762.74 కోట్లు ఇవ్వాలని లక్ష్యం
- రైతులు సాగు చేసే పంటల ఆధారంగా రుణ పంపిణీ
- ఈ నెల నుంచి ఫిబ్రవరి వరకు రుణాలు అందించనున్న బ్యాంకర్లు

నిజామాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా వ్యాప్తంగా యాసంగి పంటల సాగు మొదలైంది. మొదట ఆరుతడి పంటలను సాగు చేసే రైతులు తర్వాత వరిసాగు చేయనున్నారు. అధికారుల లెక్కల ప్రకారం ఈ యాసంగిలో 5లక్షల 30వేల ఎకరాల వరకు పంటలు సాగు అవుతాయని అంచనా వేశారు. ఈ పంటలో 4లక్షల 10వేల ఎకరాల వరకు వరిసాగు అవుతుందని అంచనా వేయగా మొక్కజొన్న, ఎర్రజొన్న, నువ్వులు, శెనగ, ఇతర పంటలను వేస్తారని వ్యవసాయ శాఖ ప్రణాళికలో పొందుపర్చారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా ఎర్రజొన్న సాగును మొదలు పెట్టారు. పలు మండలాల పరిధి లో ఈ పంటను వేస్తున్నారు. ఎర్రజొన్నతో పాటు మొక్కజొన్న సాగు కూడా రైతులు మొదలు పెట్టారు. వానాకాలం పంటలు పూర్తికావడంతో ఈ రెండు పంటలను ప్రస్తుతం రైతులు వేస్తున్నారు. జిల్లాలో వరినాట్లను కూడా ఈ నెలాఖరు నుంచి మొదలు పెట్టనున్నారు. బోధన్ డివిజన్ పరిధిలో నెలరోజుల క్రితమే వరి కోతలు పూర్తి చేసిన రైతులు ఈ నెలాఖరు నుంచి నాట్లను మొదలు పెట్టేందుకు ఏర్పాట్లు చేశారు. వరి నారుమళ్లను కూడా సిద్ధం చేశారు.

ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం

జిల్లాలో భారీగా యాసంగి సాగు ప్రారంభం కానుండడంతో యంత్రాంగం కూడా ఏర్పాట్లలో నిమగ్నమైంది. రైతులకు కావాల్సిన విత్తనాలను, ఎరువులను అందుబాటులో ఉంచారు. పెట్టుబడికి అవసరమైన రుణాలను అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ యాసంగిలో రైతులకు మొత్తం 1762.74 కోట్ల రూపాయలను పంట రుణాలుగా ఇచ్చేందుకు అధికారులు నిర్ణయించారు. జిల్లాలోని ప్రభుత్వ, గ్రామీణ, సహకార బ్యాంకులతో పాటు ప్రైవేటు బ్యాంకుల ద్వారా ఈ రుణాలను అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆయా బ్యాంకుల శాఖలకు లక్ష్యాలను నిర్దేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విధంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రైతులకు రుణాలు ఇవ్వనున్నారు. రైతులు వేసే పంటల ఆధారంగా బ్యాంకర్ల కమిటీలో తీసుకున్న నిర్ణయం ప్రకారం ఈ రుణాలను మంజూరు చేయనున్నారు. రైతు వేసే పంటల విస్తీర్ణం ఆధారంగా పట్టాదారు పాసుపుస్తకంలో ఉన్న సర్వే నెంబర్ వివరాలను బట్టి రుణాలను అందించనున్నారు. ఈ నెల నుంచి వచ్చే ఫిబ్రవరి వరకు ఈ రుణాలను ఇవ్వనున్నారు. అన్ని బ్యాంకుల పరిధిలో 80 శాతానికి పైగా రుణాలను పంపిణీ చేసే విధంగా ఏర్పాట్లు చేశారు. కలెక్టర్ ఆధ్వర్యంలో రుణాల పంపిణీపై ఇప్పటికే పలు దఫాలు సమీక్షించిన అధికారులు యాసంగిలో లక్ష్యాలను సాధించే విధంగా నిర్ణయించారు.

వానాకాలం సీజన్‌లో రుణాలు తీసుకోని పలువురు రైతులు

జిల్లాలో వానాకాలంలో రైతులకు రుణాలు ఇవ్వాలనే బ్యాంకర్ల సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. రూ.2624 కోట్ల రుణాలు ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో అనేక మంది రైతులు వానాకాలంలో రుణాలు తీసుకోలేదు. ప్రభుత్వం 2లక్షల రూపాయల రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో కొత్త రుణాలు తీసుకుంటే రుణమాఫీ కాదని రైతులు వెనకడుగు వేశారు. ఎక్కువ మంది రుణాలను తీసుకునేందుకు ముందుకు రాలేదు. వానాకాలంలో నిర్ణయించిన లక్ష్యంలో 40 శాతానికి మించి రుణ పంపిణీ కాలేదు. జిల్లాలో వానాకాలం ముగిసే వరకు 1011.95 కోట్ల రూపాయల రుణాలు మాత్రమే రైతులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం కొంతమందికే రుణమాఫీ చేయడం వల్ల మిగతా రైతులు రుణం తీసుకునేందుకు ముందుకు రాలేదు. వానాకాలం రుణమాఫీ కాకపోవడం రైతుబంధు కూడా వేయకపోవడం వల్ల ఎక్కువ మంది రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. కొంత మంది రైతులు రుణమాఫీ కావడంతో కొత్త రుణాలను తీసుకున్నారు. ఈ యాసంగిలో మాత్రం ఎక్కువ మంది రైతులు పంట రుణాలు తీసుకుంటారని అధికారులు అంచనా వేస్తున్నారు. పంటల బీమా పథకాన్ని కూడా ప్రభుత్వం అమలు చేయనుండటంతో ముందస్తుగానే ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆయా బ్యాంకుల పరిధిలో లక్ష్యాలను నిర్ణయించి రుణాలు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. రుణమాఫీ అయిన

మిగతా 8వ పేజీలో...



లింబాద్రిగుట్టపై నుంచి చక్రస్వామిని పల్లకిలో తీసుకువస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో కొండ ప్రదక్షిణ

- గోవింద నామస్మరణతో మార్మోగిన లింబాద్రిగుట్ట



భీమ్‌గల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): లింబాద్రిగుట్టపై బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం లక్ష్మీనర్సింహుని ఆయుధ శ్రేష్ఠమైన చక్ర స్నానములచే కొండ ప్రదక్షిణ నిర్వహించారు. ఏటా ద్వాదశ రోజున నిర్వహించే ఈ కొండ ప్రదక్షిణల ఉత్సవ యాగ సంరక్షణ కోసం శ్రీ చక్రస్వాములచే నిర్వహిస్తారు. శ్రీ చక్రస్వాముల వారిని బోయిల పల్లకిలో పుష్పాలంకృతులను చేసి మేళతాళలు, భగవంతుని సంకీర్తనలతో మంగళవాయిద్యాల మధ్య భక్తుల సంకీర్తనలతో వెంట రాగా ఆలయ ధర్మకర్తలు మంత్రోచ్చరణాలతో కొండ ప్రదక్షిణ సాగింది. భక్తుల గోవింద నామస్మరణాలతో లింబాద్రి గుట్ట పులకరించింది. అంతకుముందు శ్రీలక్ష్మీనర్సింహుని చెంత తులసీ వివాహాన్ని జరిపించారు. ఉత్సవాలలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



గిరిప్రదక్షిణలో పాల్గొన్న అశేష భక్తజనం

క్రీడల నిర్వహణకు అనుమతులు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సుభాష్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులకు అనుమతులు లేక పాల్గొనలేకపోతున్న అంశంపై 'ఇంటర్మీడియెట్ విద్యా శాఖ నిర్లక్ష్యం.. క్రీడాకారుల పాలిట శాపం' అనే శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. తైక్వాండో, ఇతర క్రీడాంశాలలో జిల్లా ఎంపికలు నిర్వహించుకోవచ్చని అనుమతులను ఇచ్చారు. జిల్లా ఎంపికలు నిర్వహిస్తేనే రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం ఉండటంతో జిల్లాలో ఎంపికలు ప్రధానంగా మారాయి. అయితే ఇప్పటివరకు అనుమతుల కోసం వేచి చూసిన క్రీడానిర్వాహకులు.. అధికారులు అనుమతులివ్వడంతో ఆనందం వ్యక్తం చేశారు.

జాతీయ రహదారిపై బెంబేలెత్తిస్తున్న డీజిల్ దొంగలు

- పార్కింగ్ చేసిన వాహనాలే వారి టార్గెట్
- అత్యాధునిక యంత్రాలతో క్షణాల్లో వందల లీటర్ల డీజిల్ చోరీ చేస్తున్న వైనం



7

అడవి మామిడిపల్లి వద్ద అవస్థలు!

- బస్సుల దారి మళ్లింపుతో ప్రయాణికులు, వాహనదారులకు తప్పని తిప్పలు
- ఏళ్ల తరబడి కొనసాగుతునే ఉన్న రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు



బోధన్ ప్రజల కల నెరవేరేనా?



- రైల్వే ఫ్లైఓవర్ వంతెన నిర్మాణమయ్యేనా?
- హామీలకే పరిమితం..

ఆచరణలో శూన్యం

7



దొంగ.. దొంగ

నగరంలో హడలెత్తిస్తున్న వరుస దొంగతనాలు

- తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేస్తున్న దుండగులు
- వరుస దొంగతనాలతో భయాందోళనలో ప్రజలు
- ఇల్లు వదిలి ఊరెళ్లాలంటేనే జంకుతున్న స్థానికులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

ఖిల్లా, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో జరుగుతున్న వరుస దొంగతనాలు స్థానికులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. చాలా వరకు తాళం వేసి ఉన్న వాటినే లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్నారు. నివాసాలు, దుకాణా సముదాయాలు అనే తేడా లేకుండా అన్ని చోట్ల చోరీలు జరుగుతుండడం నగర వాసులను కలవరపెడుతోంది. పదిహేను రోజుల్లోనే పదుల సంఖ్యలో చోరీ కేసులు నమోదు కావడంతో స్థానికులు భయ భ్రాంతులకు గురవుతున్నారు. తాళం వేసినఇళ్లను టార్గెట్ చేస్తూ ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నారు. దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచిస్తున్నప్పటికీ.. దొంగలు మాత్రం దొరికినకాడికి దోచుకుని వెళ్తున్నారు. దుండగులు రెండు వారాల్లోనే లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, నగదుతో పాటు వెండి వస్తువులను అపహరించారు. జిల్లా కేంద్రం, శివారు ప్రాంతాలతో పాటు నగర నడి ఒడ్డున ఉన్న మెడికల్‌షాపులను సైతం దుండగులు వదులడంలేదంటే వారు ఎంత కు తెగిస్తున్నారో అర్థమవుతోంది. జిల్లా కేంద్రంలోని నాందేవ్‌వాడకు చెందిన దత్తాత్రి అనే వ్యక్తి ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో షోలాపూర్‌కు వెళ్లగా.. దుండగులు ఆ ఇంటిని గుర్తించి అందు లో చొరబడ్డారు. ఇంట్లో ఉన్న సుమారు మూ డు తులాల బంగా రు ఆభరణాలను అపహరించారు. నగరంలో ఎల్లప్పుడు రద్దీగా ఉండే ఖలీల్‌వాడిలో గల ఓ మెడికల్‌షాప్ తాళం ధ్వంసం చేసి అం దులోని సుమారు రూ.4లక్షల నగదును ఎత్తుకెళ్లారు. తాజాగా నాల్గొటౌన్‌లోని వినాయక్‌నగర్ లోని సాయికృపనగర్‌లో కిటికీ ఊచలు తొలగించి ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లోని బీరువాలో గల సుమారు 32 తులాల బంగారు ఆభరణాలు, కిలో వెండిను ఎత్తుకెళ్లారు. ఆ ఇంటిలో వృద్ధ దంపతులు నిదిరిస్తుండగానే ఈ ఘటన జరిగింది. అదే విధంగా జిల్లా వ్యాప్తంగానూ నిత్యం ఏదో ఒక

మిగతా 8వ పేజీలో...



చోరీ తీరును పరిశీలిస్తున్న పోలీసులు(ఫైల్)

దొంగతనాల నియంత్రణకు ప్రత్యేక బృందాలు..

దొంగతనాల నివారణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. జిల్లాలో ఇటీవల జరుగుతున్న దొంగతనాల పట్ల సిబ్బందిని అప్రమత్తం చేశాం. ప్రజలు సైతం విలువైన వస్తువులను ఇంట్లో పెట్టి బయటకు వెళ్లరాదు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు సంబంధిత పోలీసు స్టేషన్‌లో సమాచారం అందించాలి. కొత్త వ్యక్తులు కాలనీలో సంచరిస్తున్నట్లు అనుమానాలు వస్తే డయల్ 100కు కాల్ చేయాలి. రాత్రి వేళ అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో కానిస్టేబుల్ స్థాయి నుంచి ఇన్స్‌పెక్టర్ స్థాయి వరకు పెట్రోలింగ్‌ను ముమ్మరం చేస్తున్నాం. రాత్రివేళ వచ్చే వాహనాలను పరిశీలిస్తున్నాం.

- బస్వారెడ్డి, అదనపు డీసీపీ

సంచులకు.. సంచులే!



- జిల్లాలో పట్టుబడుతున్న పీడీఎస్ బియ్యం
- ఎంఎల్‌ఎస్ పాయింట్లే అక్రమాలకు అడ్డాలు
- తనిఖీలు మరిచిన పౌరసరఫరాల ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు
- అసోసియేషన్ ముసుగులో రేషన్ డీలర్ల దందా

ఇటీవల పోలీసుల దాడుల్లో పట్టుబడిన రేషన్ బియ్యం

నిజామాబాద్ అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోజుకో చోట పెద్ద సంఖ్యలో పడీఎస్ బియ్యం పట్టుబడుతోంది. ట్రక్కుల కొద్దీ టన్నుల్లో రేషన్ బియ్యం పట్టుబడుతున్నా.. సంబంధిత శాఖ అధికారులు మాత్రం చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. కార్డు హోల్డర్ల నుంచి రేషన్ బియ్యాన్ని సేకరించి రైస్ మిల్లర్లకు చేరవేయడం ఒకప్పటి విధానం కాగా ఇప్పుడు ట్రెండ్ మారింది. నేరుగా ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచే రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. రేషన్ బియ్యం పక్కదారి పట్టడంలో కొంత మంది రేషన్ డీలర్స్ అసోసియేషన్ నాయకులే ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎంఎల్‌ఎస్ పాయింట్లలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లు రేషన్ బియ్యం పక్కదారి పట్టడంలో పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత వారం రోజులుగా జిల్లాలో పెద్ద ఎత్తున పీడీఎస్ బియ్యం పట్టుబడటం చర్చనీయాంశం అవుతుంది. ఇంత జరుగుతున్నా పౌరసరఫరాల అధికారులు మాత్రం నోరు మెదపడం లేదు. గతంలో రేషన్ దుకాణాలు, రైస్ మిల్లులపై పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేసినప్పటికీ గత కొన్ని రోజులుగా తనిఖీలు మాత్రం చేయడం లేదు. ప్రస్తుతం పట్టుబడుతున్న పిడిఎస్ బియ్యం కేవలం పోలీసుల తనిఖీల్లోనే దొరుకుతుండటం గమనార్హం. ఈ వ్యవహారంలోనూ రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న సిండికేట్‌తో పోలీసులకు చెడడం వారిలోనూ గ్రూపులు కావడంతో పీడీఎస్ బియ్యం ఎక్కడి నుంచి రవాణా అవుతున్న విషయాన్ని వారిలో నుంచి కొందరు పోలీసులకు సమాచారాన్ని



చేరవేస్తున్నారనేది అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో పీడీఎస్ బియ్యం సిండికేట్‌తో పోలీసులకు మంచి సంబంధాలు ఉండి నెలనెలా మామూళ్లు అందేవి. కానీ ఇటీవల పోలీసులతో పీడీఎస్ సిండికేట్‌కు పడకపోవడం వల్లే పోలీసులు సైతం దాడులు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

ఎంఎల్‌ఎస్ పాయింట్లు కేంద్రంగా..

జిల్లాలో నిజామాబాద్, ఆర్మూర్, బోధన్, జాన్కంపేట్, డిచ్‌పల్లి, మోర్తాడ్, భీంగల్‌లలో ఎంఎల్‌ఎస్ పాయింట్లు ఉన్నాయి. వీటి నుంచే ప్రతినెలా రేషన్ దుకాణాలకు రేషన్ బియ్యం సరఫరా అవుతుంది. రేషన్ డీలర్లు వారి షాపులకు కేటాయించిన మొత్తానికి డీడీలు తీసుకున్నప్పటికీ సరఫరా మాత్రం పూర్తిస్థాయిలో కావడం లేదు. నెలనెలా రేషన్ దుకాణాల నుంచి సరఫరా అవుతున్న బియ్యానికి సరాసరి బియ్యాన్ని మాత్రమే ఎంఎల్ఎస్ పాయింట్ల నుంచి ఇన్‌చార్జిలు పంపుతున్నారు. మిగిలిన బియ్యాన్ని ఇక్కడి నుంచి ఇటే పక్కదారి పట్టిస్తున్నారు. రేషన్ షాపుల ద్వారా మిగిలిన బియ్యాన్ని సైతం రేషన్ డీలర్లు నేరుగా పీడీఎస్ సిండికేట్‌కు అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎంఎల్‌ఎస్ పాయింట్లలో ఏళ్లుగా తిష్టవేసిన సీనియర్ అసిస్టెంట్లు, రేషన్ డీలర్లు కుమ్మక్కై సరఫరా చేయగా మిగిలిన బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. గతంలో దాడులలో పాలథిన్ సంచుల్లో పీడీఎస్ బియ్యం దొరికేది. కానీ ఇటీవల పోలీసులు చేస్తున్న దాడుల్లో నేరుగా ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి సరఫరా అవుతున్న గన్నీ బ్యాగులలో పీడీఎస్ బియ్యం దొరుకుతుండటంతో ఈ బియ్యం ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి సరఫరా అవుతున్నట్లు వస్తున్న వార్తలకు బలం చేకూరుతోంది. ఇటీవల ఆరోపణల నేపథ్యంలో ఆర్మూర్ ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇంచార్జిని నిజామాబాద్‌కు, నిజామాబాద్ ఇన్‌చార్జిని ఆర్మూర్‌కు బదిలీ చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు. మిగిలిన చోట్ల మాత్రం ఏళ్ల తరబడి వారే కొనసాగుతున్నారు. బియ్యాన్ని రేషన్ దుకాణాలకు సరఫరా చేసే కాంట్రాక్టర్లతో సంబంధాలు పెట్టుకొని రేషన్ బియ్యాన్ని ఎంఎల్‌ఎస్ పాయింట్ ఇన్‌చార్జిలే బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

కానరాని ఎన్‌ఫోర్స్‌మెంట్..

పౌరసరఫరాల శాఖ ద్వారా డిప్యూటీ తహశీల్దార్లతో ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు రైస్ మిల్లులు, రేషన్ దుకాణాలపై నిత్యం పర్యవేక్షణ చేస్తూ తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నా గత ఏడాది కాలంగా జిల్లాలో ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. పౌరసరఫరాల అధికారులు సైతం రైస్ మిల్లులను, రేషన్ దుకాణాలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల జిల్లా కేంద్రంలో 10 టన్నులకు పైగా రేషన్ బియ్యం పట్టుబడింది. మంగళవారం కామారెడ్డి జిల్లా బిచ్కుందలో 500 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుబడింది. పీడీఎస్

మిగతా 8వ పేజీలో...

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పోలీసు స్టేషన్‌కు తరలించిన ఇసుక ట్రాక్టర్

కోటగిరి,నవంబరు13(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలంలోని కల్లూర్ గ్రామంలో బుధవారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను తహసీల్దార్ మల్లయ్య పట్టుకున్నారు. కొడిచర్ల మంజీర నది నుంచి ఇసుకను అక్రమంగా కల్లూర్ వైపు తరలిస్తుండగా వాహనాన్ని పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు, అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ మల్లయ్య హెచ్చరించారు.

● సాటాపూర్‌లో ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రెంజల్: మండలంలోని సాటాపూర్ వద్ద బుధవారం ఉదయం ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐసాయన్న తెలిపారు.ఆయన తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. పెగడాపల్లి నుంచి ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా సాటాపూర్‌కు తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగిందన్నారు. ఇసుక ట్రాక్టర్‌కు సంబంధించి ఎలాంటి పత్రాలు లేనందున ట్రాక్టర్‌ను సీజ్‌చేసి కేసునమోదు చేయడం జరిగిందన్నారు.

ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లుకు తరలించాలి: సబ్ కలెక్టర్


రాణాకలాన్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బోధన్ సబ్ కలెక్టర్

ఎడపల్లి, నవంబరు13(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రం ద్వారా కొన్న వరి ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లుకు తరలించాలని బోధన్ సబ్‌కలెక్టర్ వికాస్ మహతో అన్నారు.బుధవారం ఎడపల్లి మండలంలోని రానాకలాన్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన్ డివిజన్ పరిధిలో దాదాపు అన్ని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోల్లు పూర్తయ్యాయని, రానాకలాన్ గ్రామంలో కొనుగోలు చేసిన ధాన్యం 20వేల బస్తాల వరకు మిగిలాయని వాటిని రెండు రోజుల్లో రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు.ఈకార్యక్రమంలో ఆయన వెంట సహకార సంఘం కార్యదర్శి రాజారాం, రైతులు తదితరులు పాల్గొన్నారు

మతోన్మాదులను కఠినంగా శిక్షించాలి


బోధన్ సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో హిందు దేవాలయాలపై దాడులు చేస్తున్న మతోన్మాదులను కఠినంగా శిక్షించాలని బీజేవైఎం బోధన్ పట్టణ అధ్యక్షులు ఏనుగంటి గౌతం గౌడ్ అన్నారు. బుధవారం బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ వికాస్ మహతోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దేవాలయాలపై వరుస దాడులు చేస్తున్న మతోన్మాదులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఇకపై హిందూ దేవాలయాలపై దాడులు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆలయాలపై కొత్త జీవోను జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. లేని యెడల రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం అధ్యక్షులు గౌతంగౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి వాసు, అరవింద్, నాయకులు కస్నా లింగం, కిరణ్, శ్రీను, రాజు, చిన్నసంతోష్, దీపక్, కార్యకర్తలు తదితరులున్నారు.

ఏర్గట్ల బాలుర వసతి గృహం తనిఖీ

ఏర్గట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలుర వసతి గృహాన్ని ఆర్మూర్ డివిజన్ పంచాయతీ అధికారి శివకృష్ణ తనిఖీ చేశారు. అందులో భాగంగా వసతి గృహంలోని వంటగది, విద్యార్థులుండే గదులు, రికార్డులు, పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపివో శివచరణ్‌లు పాల్గొన్నారు.

లంచం తీసుకున్న కేసులో

మున్సిపల్ ఏఈకి జైలు శిక్ష

ఖిల్లా, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): లంచం తీసుకున్న కేసులో మున్సిపల్ కార్యాలయ అసిస్టెంట్ ఇంజనీర్ పోరెడ్డి అశోక్‌కు రెండేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు 40వేల రూపాయల జరిమానా విధిస్తూ నాంపల్లి కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి మహ్మద్ అఫ్రోజ్ అక్తర్ బుధవారం తీర్పు చెప్పారు. కేసుకు సంబంధించిన వివరాలు ఏసిబి డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని బొబ్బిలి వీధి సంజీవ్‌పార్కు నుంచి విజ్ఞాన పాఠశాల వరకు రోడ్డు కొలతలను నమోదు చేయడానికి అశోక్ బండారి అర్వింద్ వద్ద 20వేల రూపాయలు డిమాండ్ చేశాడు. ఫిర్యాదుదారుడు ఆ డబ్బులు ఇవ్వడం ఇష్టం లేక ఏసిబి అధికారులను ఆశ్రయించాడు. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఏసీబీ అధికారులు 29 మే 2012న అశోక్‌ను లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయనను ఏసిబి కోర్టులో హాజరుపర్చగా ఏసిబి తరపున ఏఎల్ మనోజ్ఞ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏసిబి కోర్టు వాదనలు వినిపించారు. ఇరువర్గాల వాదనలు విన్న కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి మహ్మద్ అఫ్రోజ్ అక్తర్ బుధవారం తీర్పు వెలువరించారు. ఈ శిక్షలు ఏకకాలంలో వర్తిస్తాయని తెలిపారు. ఒకవేళ జరిమానా డబ్బులు చెల్లించని యెడల ఒకనెల అదనపు సాధారణ కారాగార శిక్ష ఉంటుందని ఆ తీర్పులో వెల్లడించారు.

రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి

దోమకొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతులకు వరిధాన్యం కొనుగోలు సెంటర్‌లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని తహసీల్దార్ సంజయ్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద కొనుగోలు సెంటర్‌ను మండల వ్యవసాయాధికారిణి మణిదీపికతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంటర్‌లో నీటి సదుపాయం కల్పించాలని, ఫైచర్ రైతులకు అనుకూలంగా ఉన్నటువంటి సమయాల్లో తీయాలని సూచించారు. సాయంత్రం సమయంలో ఫైచర్ చూస్తే రైతు వడ్లు రాశి చేయుటకు ఇబ్బందులు పడవలసి వస్తుందన్నారు. చీకట్లో రైతులు ధాన్యం వద్ద తార్పాలిన్‌లను తీస్తున్నపుడు పాములు ఉంటున్నాయని తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. సెంటర్ వద్ద రైతులు ధాన్యం విక్రయించుకుని వెళ్లే వరకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏవో మనిదీపిక, ఏఈవో క్రిష్టారెడ్డి, మాన్యూష పాల్గొన్నారు.

నాళేశ్వర్‌లో విద్యుత్ శాఖ పొలంబాట

నవీపేట, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాళేశ్వర్‌లో బుధవారం విద్యుత్ శాఖ అధికారులు పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవీపేట ఏడీఈ ప్రశాంత్ రెడ్డి, జన్నేపల్లి ఏఈ శ్రీనివాస్, బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, నాళేశ్వర్ మాజీ సర్పంచ్ సరిన్, లక్ష్మణ్, పలువురు రైతులు, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి


కోటగిరిలో సర్వేను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

● జిల్లా అదనపు కలెక్టర్ అంకిత్

కోటగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ సర్వేను ఎన్యూమలేటర్లు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. కోటగిరి మండల కేంద్రంలో బుధవారం సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను ఆయన పరిశీలించారు.మైనారిటీ కాలనీలో నిర్వహిస్తున్న సర్వే తీరుపై ఆయన వాకబు చేశారు. సర్వేపై ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ వివరాలు నమోదు చేయాలని సూచించారు. వివరాల సేకరణలో లోపాలు ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉమ్మడి మండలంలో ఇప్పటి వరకు ఎంత మేరకు సర్వే పూర్తయిందని ఎన్యూమలేటర్లను అడిగి తెలుసుకున్నారు. సర్వేలో 6, 7కాలంలో కులం, భూమి వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. సర్వేను నిర్ణీత గడువు లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్, ఎంపీడీవో తదితరులున్నారు.

● పకడ్బందీగా ఇంటింటి కుటుంబ సర్వే : ఆర్డీవో రాజాగౌడ్

ఏర్గట్ల: పకడ్బందీగా గ్రామాల్లో సమగ్ర ఇంటిం టి సర్వే నిర్వహించాలని ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఇంటింటి కుటుంబ సర్వేను ఆయన పరిశీ లించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీలత, మండల స్పెషల్ ఆఫీసర్ శివ కృష్ణ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎంపివో శివచరణ్‌లు పాల్గొన్నారు.


ఆర్మూర్‌లో ఆర్డీవో రాజాగౌడ్

ముప్కాల్: ముప్కాల్‌లో కొనసాగుతున్న సమగ్ర ఇంటింటి సర్వే తప్పులు లేకుండా వేగవంతం నిర్వహించాలని ఆర్డీవో రాజాగౌడ్ అధికారులకు సూచించారు. బుధవారం ముప్కాల్ మండలంలో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను ఆయన తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి స్రవంతి, ఇన్‌చార్జి తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో ఎండి.గోస్‌మోహీనోద్దీన్, పంచాయతీ కార్యదర్శులు, ఎన్యు మారేటర్లు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణన, ఇంటింట సర్వే కార్యక్రమాన్ని ఈ నెల 18 లోపు పూర్తిచేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాయాగౌడ్ అన్నారు. బుధవారం కమ్మర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో మండంలో కొనసాగుతున్న సర్వేపై మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజా శ్రీనివాస్, తహసీల్దార్ అంజనేయులు, ఎంఈవో ఎన్ ఆంధ్రయ్య, ఏపీఎం కుంట గంగారెడ్డి, ఎపీవో విద్యానంద్, సీసీ నవీన్ పాల్గొన్నారు.

● కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని 36వార్డులలో సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. బుధవారం 12. 13వార్డులలో ఆయన పరిశీలించి ప్రజల సమస్యలను నివృత్తి చేశారు. ప్రతీ ఒక్కరు సర్వేకు సహకరించాలని ఆయన కోరారు. ఆయన వెంట కౌన్సిలర్‌లు తాటి హన్మాండ్లు, రింగుల భారతిభూషణ్, సూపర్‌వైజర్‌లు ఉన్నారు.

కోటగిరిలో ముస్తాబైన అయ్యప్ప, సాయిబాబా ఆలయాలు

● నేటి నుంచి నాలుగు రోజుల పాటు ప్రత్యేక పూజ కార్యక్రమాలు


అయ్యప్ప ఆలయం

కోటగిరి,నవంబరు13(ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలో అయ్యప్ప, సాయిబాబా ఆలయాలు ప్రారంభానికి ముస్తాబయ్యాయి. సుమారు 3కోట్ల రూపాయల వ్యయంతో ఆలయాన్ని నిర్మించారు. గురువారం నుండి ఆలయ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలను నిర్వహించడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. 14వ తేదిన దేవతామూర్తుల శోభాయాత్ర, 15న అఖండ నామ స్మరణ, 16న యాగశాల ప్రవేశం, 17న మహ సుదర్శన, చండీ హోమం, 18న యంత్ర విగ్రహ ప్రతిష్ట మహ కుంభాభిషేకం, కేరళ సంప్రదాయ తాంత్రిక మహ పడిపూజ, పుష్పాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కోటగిరి గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారి పోల విఠల్ సెట్ ఆలయ నిర్మాణానికి ఎకరం 10గుంటల భూమిని విరాళంగా అందించారు. ఎత్తొండ క్యాంప్ గ్రామానికి చెందిన గురుస్వామి రాజా అయ్యప్ప విగ్రహాన్ని, కోటగిరికి చెందిన పల్లెంపాటి శివరామకృష్ణయ్య సాయిబాబా విగ్రహాలను తయారు చేయించారు. సుమారు 3కోట్ల వ్యయంతో ఆలయం రూపుదిద్దుకుంది. విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలను కన్నుల పండువగా నిర్వహించేందుకు గ్రామస్థులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

గ్రూప్-3 పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి


కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, అధికారులు

కామారెడ్డిటౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-3 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్, అధి కారులతో గ్రూప్ 3 పరీక్ష నిర్వహణపై పలుసూచనలు చేశారు. ఈ నెల 17,18 తేదీల్లో జరిగే గ్రూప్-3 పరీక్షలకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఎలాంటి లోటుపాటు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటూ పరీక్ష కేంద్రా ల్లో అన్ని ఏర్పాట్లు చేపట్టాలని, ప్రతీ కేంద్రంలో సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యుత్ అంతరాయం కల్గకుండా,త్రాగునీరు అందుబాటులో ఉంచడంతో పాటు హాల్‌లోకి ఎవరిని సెల్‌ఫోన్‌తో హాజరుకాకుండా చూడాలని తెలిపారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సింధూశర్మ అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్, అ దనపు ఎస్పీ నరసింహరెడ్డి, రీజనల్ కోఆర్డినేటర్ విజయకుమార్ పాల్గొన్నారు.

పత్తి పంటకు కనీస మద్దతు ధర రూ.10 వేలు చెల్లించాలి

పెద్దకొడప్‌గల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పత్తి రైతులు సాగు చేసిన పంటకు కనీస మద్దతు ధర 10 వేలు చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సురేష్‌గొండ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రస్తుతం సీసీఐ ద్వారా క్వింటా పత్తికి మద్దతు ధర 7520 ఉండగా, ప్రభుత్వ హామీ ప్రకారం 575 రూపాయల బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో పాటుగానే స్వామినాథన్ కమిషన్ సిపార్సుల ప్రకారం రైతులు పంట పెట్టుబడికి పెట్టిన దానికి 50 శాతం కలిపి పంటకు మద్దతు ధర చెల్లించాలని పేర్కొన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం తాను ప్రకటించిన మద్దతు ధరకు బోనస్‌తో కలిపి చెల్లించాలని లేదంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేస్తామని తెలిపారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌కు సన్మానం

పెద్దకొడప్‌గల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా నియాయకమైన జుక్కల్ మండలం పెద్ద ఏడ్గి గ్రామానికి చెందిన సౌజన్య రమేష్‌ను బుధవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు రూసేగాం భూమయ్య మాట్లాడుతూ మద్నూర్ మార్కెట్ చైర్‌పర్సన్‌గా తమ సామాజిక వర్గానికి చెందిన సౌజన్యను నియమించడం సంతోషంగా ఉందని తెలిపారు. తమ సామాజిక వర్గంకు ప్రాధాన్యత ఇచ్చి చైర్‌పర్సన్‌గా నియామకం చేసిన జుక్కల్ ఎమ్మెల్యే తోటకు, సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు అయిల్ వార్ మారుతి, మద్నూర్ మండల అధ్యక్షులు శంకర్, నాయకులు బాలాజీ, మారుతి, గంగరాం, సురేష్, భుజంగ్, అఖిల్,రాజు పాల్గొన్నారు.

నేటి నుంచి సహకార, గ్రంథాలయాల వారోత్సవాలు

మద్నూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండలంలో నేటి నుంచి సహకార సంఘం వారోత్సవాలు నిర్వహించ నున్నట్లు కార్యదర్శి బాబురావు వెల్లడించారు. సహకార సంఘం పరిధిలో కార్యవర్గసభ్యులు జెండా కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు.

● గ్రంథాలయ వారోత్సవాలు

ఉమ్మడి మద్నూర్ మండల కేంద్రంలోని గ్రంథాలయంలో నేటినుంచి గ్రంథాలయ వారోత్సవాలు జరగనున్నాయి. ఉత్సవాలలో భాగంగా విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలు నిర్వహించనున్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు చివరి రోజున ప్రశంసా పత్రాలు బహుమతులు ప్రధానం చేయనున్నట్లు గ్రంథాలయ పాలకుడు తెలిపారు.

ఎస్‌ఎఫ్‌ఐ పోరాట ఫలితమే పాఠశాల మూసివేత..

పెద్దఏడ్గి గ్రామంలో వేద వాహిణి విద్యానికేతన్‌కు ఎలాంటి అనుమతులు లేకుండ నిర్వహిస్తున్నారని తాము గతంలో చేసిన పోరాట ఫలితంగానే జిల్లా విద్యాశాఖాధికారులు స్పందించి పాఠశాల మూసివేయించారని జిల్లా ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శి అజయ్ తెలిపారు.

తడపాకల గోదావరిలో యువకుడి మృతి


మృతుడు రామ్‌చరణ్ తేజ్

ఏర్గట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తడపాకల్ గ్రామంలోని గోదావరిలో బుధవారం ఉమ్మాయి రామ్‌చరణ్ తేజ్ (16) నీటి మునిగి మృతి చెందాడు. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం మాక్లూర్ మండలం మానిక్ బండార్ గ్రామానికి చెందిన ఉమ్మాయి రామ్‌చరణ్ తేజ్ వారి కుటుంబ సభ్యులతో కలిసి తడపాల్ గోదావరికి రాగా స్నానం చేయడానికి రామ్‌చరణ్ తేజ్ అతని తల్లి నీటిలో దిగడంతో రామ్‌చరణ్‌తేజ్‌కు ఈత రాకపోవడంతో నీటి మునిగి మృతి చెందాడని, మృతుడి తల్లి గంగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై రాము తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఆర్మూర్‌టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ శివారులో గుర్తుతెలియని వ్యక్తి (35) మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. మృతదేహం ఒంటిపై నలుపు తెలు పు రంగు షర్టు, బ్లూ కలర్ జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, ఎవరికైనా సమాచారం తెలిస్తే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని తెలిపారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురిలో భద్రపర్చా మని అన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల తొలగింపు ఆపాలి

ఆర్మూర్‌రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులను అక్రమంగా తొలగింపును నిలిపి వేయాలని కోరుతూ సీఐటీయు ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భూమన్న, రఫీక్, సుజాత, సత్తెమ్మ, దేవాయి, సాజిద్‌ఖాన్, ఖలీం, తదితరులు పాల్గొన్నారు.

పోస్టుమార్టం భవన నిర్మాణానికి స్థల పరిశీలన

మోర్తాడ్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో బుధవారం పోస్టుమార్టం భవన నిర్మాణానికి అధికారులు స్థల పరిశీలన చేశారు. గత ప్రభుత్వం పోస్టుమార్టం కోసం నిధులు మంజూరు చేసిన పనులు జరగలేదు. దీంతో అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆర్‌అండ్‌బీ అధికారులు, సంబంధిత అధికారులు స్థల పరిశీలన చేసి స్థలాన్ని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యాల రాములు, డీసీసీబీ డైరెక్టర్ మహిపాల్‌రెడ్డి, అధికారులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి భవన నిర్మాణ కార్మిక మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ఎల్లారెడ్డి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కమల ఐలన్న ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికుమార్, జిల్లా కన్వీనర్ పయ్యావుల శ్రీనివాస్, ఎల్లారెడ్డి మండల కార్మికులు, కార్మిక నాయకులతో కలిసి భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం కామారెడ్డి జిల్లా నాల్గో మహాసభ పోస్టర్లు బుధవారం ఎల్లారెడ్డిలో ఆవిష్కరించారు. ఈనెల 18న కామారెడ్డిలో జరగనున్న మహాసభకు భారీ సంఖ్యలో హాజరు కావాలన్నారు. ఈకార్యక్రమంలో మార్లు సాయిబాబా, లక్ష్మణ్, రజాక్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద వ్యతిరేక సదస్సును జయప్రదం చేయాలి

ఆర్మూర్‌రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఈ నెల 17వ తేదీన నిజామాబాద్‌లో కమ్యూనిస్టు పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించనున్న మతోన్మాద వ్యతిరేక సదస్సును విజయవంతం చేయాలని న్యూడెమోక్రసీ జిల్లా సహాయకార్యదర్శి దాసు కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు సూర్యశివాజీ, బాలయ్య, ప్రిన్స్, అబ్దుల్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

పులిపిరికి అరుదైన చికిత్స

» ఆకుపసరుతో నిమిషాల్లో తొలగింపు


పులిపిర్లకు చికిత్స చేస్తున్న దృశ్యం

నిజామాబాద్ జిల్లా, నవంబర్ 13: పులిపిర్లకు వడియార మల్లికార్జున అరుదైన చికిత్స నందిస్తున్నారు. ఆకు పసరుతో నిమిషాల్లో శరీరంపై ఉన్న పులిపిర్లు తొలగిస్తామంటున్నారు.నిజామాబాద్ జిల్లా, హోటల్ హరిత ఇందూర్, పంచవటి మెగా మార్ట్ పైన, రైల్వే స్టేషన్ ఎదురుగా నిజామాబాద్ నందు ఆయన పులిపిర్లకు చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 13, 14, 15 తేదీల్లో మూడు రోజుల పాటు వాటికి చికిత్స అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం పలువురికి పులిపిర్లు తొలగించారు. సాధారణంగా మనిషిలో 7 రకాలుగా ఈ పులిపిర్లు కనిపిస్తాయన్నారు. ఏ రకమైన పులిపిరినైనా సరే తాము సేకరించిన పొడిని తడిపిన దూదితో పులిపిరిపై అద్ది తక్షణమే తొలగిస్తామన్నారు. అనంతరం ఆదే పొడి మళ్లీ పులిపిరి తొలగించిన ప్రదేశంలో అద్దుతామన్నారు. గురు,శుక్ర వారం రెండు రోజుల్లో మాత్రమే వైద్యం అందుబాటులో ఉంటుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. 9849628485 నెంబర్లులోని సంప్రదించాలన్నారు.

రసవత్తరంగా మండలస్థాయి క్రీడా పోటీలు


ఖోఖోలో తలపడుతున్న పచ్చలనడ్కుడ, రామన్నపేట్ క్రీడాకారులు

వేల్పూర్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం మోతె గ్రామంలోని హైస్కూల్ ఆవరణలో మంగళవారం ప్రారంభమైన మండల అంతర్ పాఠశాలల క్రీడా పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. బుధవారం సాయంత్రానికి మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన క్రీడాకారులు జూనియర్,సబ్‌జూనియర్ బాలికలవాలీబాల్, ఖోఖో, కబడ్డీ క్రీడా పోటీల్లో క్రీడాకారులు ఉత్సహంగా పాల్గొన్నారు.అన్ని క్రీడల్లో కూడా కొన్ని ఫైనల్ మ్యాచ్‌లు ముగిసినప్పటికీ మరికొన్ని సెమి ఫైనా ల్, ఫైనల్ మ్యాచ్‌లను శుక్రవారం నిర్వహించనున్నట్లు పీడీసురేష్ కుమార్ తెలిపారు.

దుబాయ్ రోడ్డు ప్రమాదంలో అమ్దాపూర్ వాసి మృతి

● దుబాయ్‌కి వెళ్లిన వారం లోపే మృత్యు ఒడిలోకి
● 80రోజుల్లోపే శవమై తిరిగి వస్తున్న వైనం ● రోదిస్తున్న కుటుంబ సభ్యులు


హరికృష్ణ(ఫైల్)

బోధన్‌రూరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామానికి చెందిన చింతకుంట హరికృష్ణ(38)అనే వ్యక్తి దుబాయ్‌లో పనుల నిమిత్తం వెళ్లాడు. వెళ్లిన వారం రోజుల లోపే అక్కడ రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. నేడు అతని మృతదేహం స్వగ్రామానికి రానుంది. మృతుడికి భార్య, ఇద్దరు చిన్న పిల్లలు ఉండడం గ్రామస్థులకు కంట తడి పెట్టిస్తుంది. అందరితో కలిసి మెలిసి ఉండే హరికృష్ణ బతుకుదెరువు కోసం పరాయి దేశానికి వెళ్లి శవమై తిరగి రావడం శోచనీయమని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుబాయ్‌లో పని కోసం వెళ్లిన వారం లోపే అక్టోబరు 31వ తేదిన దుబాయ్‌లో రోడ్డు దాటుతుండగా కారు ప్రమాదంలో మరణించాడని అక్కడి కంపెనీ ప్రతినిధులు ఈ నెల 7వ తేదీన కుటుంబ సభ్యులకు తెలిపారు. మృతుడికి భార్య, మూడు, ఒక సంవత్సరాల వయసు గల ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారు. కుటుంబ సంపాదన కోసం పరాయి దేశానికి వెళ్లి వారంలోపే మృతి చెంది నేడు స్వగ్రామానికి మృతదేహం రావడంతో భార్య పిల్లల కన్నీళ్లను ఆపడం ఎవరి తరం కావడం లేదు. అక్టోబరు 24వ తేదిన బతుకు దెరువు కోసం దుబాయ్‌లో గల ట్రాన్స్‌గార్డ్ కంపెనీలో క్లీనర్‌గా పనిచేయడానికి వెళ్లడం జరిగిందని గ్రామస్థులు తెలిపారు. పోయిన వారంలోపే మృతి చెందడం బాధకరనిమని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి సంగీత సాహిత్యంలో గిద్ద విద్యార్థినుల ప్రతిభ

రామారెడ్డి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ రవీంద్ర భారతి ఆడిటోరియంలో రాష్ట్రస్థాయి తెలంగాణ సంగీత సాహిత్య నాటక అకాడమీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శనశాలలో బుధవారం కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం గిద్ద గ్రామంలో ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గిద్ద విద్యార్థినులు తృతీయ స్థానంలో గెలుపొందారు. మంచి గుర్తింపు తెచ్చుకున్న విద్యార్థినులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కన్నయ్య హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మాణిక్యం, రాజేశ్వర్, భూమేష్, విష్ణువర్ధన్, మహేష్, స్వప్న ప్రియ, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగట్టాలి


వేల్పూర్‌లో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి నర్సింహరెడ్డి

వేల్పూర్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చంలో విఫలమవుతుందని, వాటిపై కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ.నర్సింహరెడ్డి అన్నారు. బుధవారం వేల్పూర్ మండల కేంద్రంలో మండల బీజేపీ అధ్యక్షుడు ఏలేటి రమేష్‌రెడ్డి అధ్యక్షతన భారతీయ జనతా పార్టీ వర్క్‌షాప్ కార్యక్రమాన్నివ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ప్రధానకార్యదర్శి నర్సింహరెడ్డి మాట్లాడుతూ పార్టీ సభ్యత్వ నమోదు లక్ష్యానికి అనుగుణంగా చేస్తూ పార్టీ బలోపేతానికి ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మల్కన్నగారి మోహన్, ప్రధానకార్యదర్శి భానుచందర్, బద్దం రాజారెడ్డి, నర్సారెడ్డి, బోంపల్లి గంగాధర్, నగేష్, రాజు, మధు, రమేష్, కార్యకర్తలు, పాల్గొన్నారు.


జాతీయస్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థుల ఎంపిక

ముప్కాల్, నవంబరు 12(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్-17 ఖోఖో పోటీలు నిర్వహించగా బాల్కొండకు చెందిన కేజీబీవీ విద్యార్థిని మైథిలి జాతీయస్థాయికి ఎంపిక కాగా బాల్కొండ మోడల్ స్కూల్ విద్యార్థిని బి.అపర్ణలు ఎంపికయ్యారు. ఈనెల 8, 9, 10తేదీల్లో ఖమ్మంలో నిర్వహించిన అండర్-17 రాష్ట్రస్థాయి పోటీల్లో కేజీబీవీ విద్యార్థులు మైథిలి, ఆనంది, శ్రీవర్ష, ఆదర్శ పాఠశాలకు చెందిన అపర్ణలు జిల్లా జట్టు నుంచి పాల్గొనగా మొదటి బహుమతి సాధించారు. అందులో రాష్ట్రస్థాయి నుంచి జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు జిల్లా నుంచి ముగ్గురిని ఎంపిక చేయగా అందులో బాల్కొండ కేజీబీవీ పాఠశాల నుంచి ఒకరు, ఆదర్శ పాఠశాల నుంచి ఒకరు ఎంపికయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో నిజామాబాద్ జిల్లా ప్రథమ బహుమతి సాధించారు. జాతీయస్థాయి పోటీలు డిసెంబరు 5,6,7,8తేదీల్లో ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో జరగనున్న పోటీలకు విద్యార్థులు జాతీయస్థాయి పోటీలో పాల్గొనున్నారు.

ఆరెపల్లిలో ఉచిత వైద్య శిబిరం

రాజంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరేపల్లి గ్రామంలో బుధవారం తెలంగాణ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరాన్ని నిర్వహించినట్లు పశువైద్యాధికారి డాక్టర్ అనిల్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆవులు, గేదెలు ఏమైన కట్టినచో వాటిని పరీక్షించి గర్భకోశ వ్యాధులకు తగిన చికిత్స చేయించాలని సూచించారు. లింగ నిర్ధారిత వీర్యం వాడడం వల్ల 90 శాతం ఆడదూడలు మాత్రమే జన్మిస్తాయని తెలిపారు. ఇందుకు గాను రైతువాటా రూ.250 చెల్లించాలని తెలిపారు. ఒకే పశువుకు వరుసగా రెండు ఎదలలో లింగనిర్ధారిత వీర్యం వాడిన చూలు కట్టకపోతే రైతువాటా రైతు అకౌంట్‌కు వాపస్ ఇవ్వబడుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోఏల్‌డీఏ డాక్టర్ అబ్దుల్‌మాజీద్, పశువైద్యాధికారి రామచందర్, డీఎల్‌డీఏ సూపర్‌వైజర్ కృష్ణ, పాలకేంద్రం అధ్యక్షుడు స్వామిగౌడ్, సెక్రటరీ నర్సింలు, రాజేందర్‌రావు, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఫోకస్



● చిన్నాపూర్ శివారులో కొనసాగుతున్న వంతెన నిర్మాణ పనులు



● మట్టి రోడ్డు గుండా వెళ్తున్న వాహనాలు

అడవి మామిడిపల్లి వద్ద అవస్థలు!

● బస్సుల దారి మళ్లింపుతో ప్రయాణికులు, వాహనదారులకు తప్పని తిప్పలు ● ఏళ్ల తరబడి కొనసాగుతూనే ఉన్న రైల్వే బ్రిడ్జి నిర్మాణ పనులు ● నాలుగు గ్రామాల ప్రజలకూ ఇబ్బందులే..

ఆర్మూర్ రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మాక్లూర్ మండలం అడవి మామిడిపల్లి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల కారణంగా వాహనాలను దారి మళ్లిస్తున్నారు. బస్సుల దారి మళ్లింపుతో ప్రజలకు అవస్థలు ఎక్కువయ్యాయి. నిజామాబాద్ నుంచి ఆర్మూర్, నిర్మల్, కరీంనగర్, వరంగల్ వైపు వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు ద్విచక్ర వాహనాలు సహితం చిన్నాపూర్, కల్లెడ, ఆలూర్ మీదుగా పంపిస్తున్నారు. ఆర్మూర్ వైపు నుంచి నిజామాబాద్ వెళ్లే వాహనాలను యథావిధిగా పాత రూట్‌లోనే వెళ్లేందుకు అవకాశం కల్పించారు. రెండు వైపుల నుంచి వాహనాలకు అనుమతి ఇస్తే మామిడిపల్లి వద్ద ట్రాఫిక్‌జామ్ సమస్య తలెత్తే అవకాశం ఉందని అధికారులు వన్‌వే చేశారు. చిన్నాపూర్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై బారీ కేడ్లు ఏర్పాటు చేసి పోలీసులు కాపల ఉండి నిజామాబాద్ వైపునుంచి వచ్చే అన్ని వాహనాలను చిన్నాపూర్ వైపుగా దారి మళ్లిన్నారు. ఆర్మూర్‌లోని దోబిఘాట్ వద్ద కూడా పోలీసులు కాపల ఉండి ధాన్యం బస్తాల లోడ్‌తో వచ్చే లారీలు, ఇతర భారీ వాహనాలను మామిడిపల్లి, డిచ్‌పల్లి మీదుగా నిజామాబాద్‌కు వెళ్లాలని సూచిస్తున్నారు.



భారీ వాహనాలకు అనుమతిలేదని పెట్టిన సూచిక బోర్డు

విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

దారి మళ్లింపుతో అంకాపూర్, మునిపల్లి, గుత్ప, రాంచంద్రపల్లి గ్రామాల ప్రజలు నిజామాబాద్ నుంచి స్వగ్రామాలకు రావాలంటే చిన్నాపూర్ మీదుగా ఆర్మూర్ వచ్చి వెళ్లవలసి వస్తుంది. ఈ గ్రామాల నుంచి నిజామాబాద్‌కు పాఠశాల, కళాశాలలో విద్యానభ్యాసించడానికి వెళ్లే విద్యార్థులు, ఆసుపత్రులు, ఇతర వ్యక్తిగత పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వెళ్లి పనులు ముగించుకొని నిజామాబాద్ నుంచి తిరుగు ప్రయాణంలో స్వగ్రామం చేరుకోవడానికి చిన్నాపూర్ మీదుగా ఆర్మూర్ వరకు రావాల్సి వస్తోందని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. ఆ తర్వాత తిరిగి తమ ఊళ్లకు వెళ్లడానికి బస్సులను ఆశ్రయించాల్సి వస్తుందంటున్నారు.

నత్తనడకన సాగుతున్న పనులు

అడవి మామిడిపల్లి వద్ద రైల్వే పనులు నత్తనడకన సాగుతున్నాయి. 2018లో ప్రారంభమైన పనులు నత్తను తలపిస్తున్నాయి. ఆర్వోబీల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 2018లో నిధులను రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలో జమ చేసింది. అట్టి నిధులు కాస్త దారి మళ్లిడంతో పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుంది. ఎట్టకేలకు ఇటీవల పనులను వేగవంతం చేశారు. పనులు చేపట్టడం వల్ల వాహనాలను నెల రోజుల వరకు దారి మళ్లిస్తామని అధికారులు చెబుతున్నప్పటికీ పనులు పూర్తి కావడానికి ఎక్కువ సమయం పడుతుందని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

ఇరుకు రోడ్లతో ఇక్కట్లు

వాహనాలను చిన్నాపూర్, కల్లెడ, ఆలూర్ మీదుగా ఆర్మూర్‌కు దారి మళ్లించడంతో ఇరుకు రోడ్లతో ఉన్న గ్రామాలలో వాహనాల రద్దీ పెరిగి ఇబ్బందులు తప్పడం లేదు. ఎదురుగా వాహనాలు వస్తే ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. చిన్నాపూర్ శివారులో వంతెన నిర్మాణానికి పనులు ప్రారంభించారు. దీంతో ఆ ప్రాంతంలో బస్సులు, ఇతర వాహనాలు వెళ్లడం ఇబ్బందికరంగా ఉందంటున్నారు. అసలే మట్టిరోడ్డు కావడంతో వాహనదారులకు జాగ్రత్తగా వెళ్లాల్సి వస్తుందని పలువురు ప్రయాణికులు, వాహనదారులు పేర్కొంటున్నారు. రాత్రి సమయంలో అజాగ్రత్తగా, వేగంగా వెళ్తే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అదే విధంగా చిన్నాపూర్, కల్లెడ గ్రామాల వద్ద ఉన్న మూల మలుపుల వద్ద వాహనదారులు జాగ్రత్తగా వెళ్ళాల్సిన అవసరం ఉంది. దూర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సులను నిజామాబాద్ నుంచి డిచ్‌పల్లి మీదుగా మళ్ళిస్తే ఈ రోడ్డులో ట్రాఫిక్ కొంతవరకైనా తగ్గేదంటున్నారు. రైల్వే అధికారులు పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేస్తే ప్రజలకు ఎప్పటి లాగే మెరుగైన రవాణా సౌకర్యం కలుగుతుంది.

దొంగలు బాబోయ్!!

జాతీయ రహదారిపై బెంబేలెత్తిస్తున్న డీజిల్ దొంగలు

● పార్కింగ్ చేసిన వాహనాలే వారి టార్గెట్
● అత్యాధునిక యంత్రాలతో క్షణాల్లో వందల లీటర్ల డీజిల్ చోరీ చేస్తున్న వైనం



భిక్కనూరులో లారీ డిజిల్ ట్యాంకు మూతను దొంగలు ధ్వంసం చేశారిలా..

భిక్కనూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి పార్కింగ్ చేసిన లారీలు, పెద్ద వాహనాలే(లారీలు) వారి టార్గెట్. పోలీలకు చిక్కకుండా కూల్‌గా ప్రత్యేక వాహనాల్లో వచ్చి క్షణాల్లో పార్కింగ్ చేసిన వాహనాలలోని డీజిల్‌ను అత్యాధునిక యంత్రాల సహాయంలో మాయం చేస్తున్నారు. ఇటీవల కామారెడ్డి జిల్లాలోని జాతీయ రహదారి వెంట ఉన్న దాబాలు, పార్కింగ్ స్థలాల వద్ద డీజిల్ దొంగతనాలు ఎక్కువయ్యాయి. పార్కింగ్ చేసిన వాహనాల నుండి పెద్దఎత్తున డిజిల్ దొంగతనం చేస్తూ వాహనదారులను, పోలీసులను బెంబేలెత్తిస్తున్నారు. ముఖ్యంగా ఇటీవలి కాలంలో భిక్కనూరు మండలంలోని జాతీయ రహదారి పక్కన ఉన్న దాబాల వద్ద, పెట్రోల్ బంక్‌ల వద్ద, టోల్ సమీపంలో ఇలాంటి దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీంతో వాహనదారులు, దాబా యాజమానులు లబోదిబోమంటున్నారు.

● పార్కింగ్ చేసిన పెద్ద వాహనాలే టార్గెట్

44వ జాతీయ రహదారిపై నిత్యం పెద్దసంఖ్యలో వాహనాలు రవాణా సాగిస్తుంటాయి. రాత్రి సమయంలో అలసిపోయిన వాహనదారులు ఎక్కువగా దాబాల వద్ద, పెట్రోల్ బంక్‌ల, పార్కింగ్ స్థలాల వద్ద భోజనాలను చేసి అక్కడే వాహనాలను నిలుపుకుని సేదతీరుతుంటారు. ఇలా పార్కింగ్ చేసి ఉండి.. వాహనదారులు నిద్రలో ఉంటే చాలు అలాంటి వాహనాలను టార్గెట్ చేసుకుని రెచ్చిపోతున్నారు. వాహనాల డీజిల్ ట్యాంకు మూతలను, వాహన ఇండికేటర్ల వైర్లను తొలగించి వందల లీటర్ల డీజిల్‌ను పీల్చేస్తున్నారు. దాబాల వద్ద, పెట్రోల్‌బంక్ వద్ద సీసీ కెమెరాలు ఉండి ఎంత సేఫ్టీ ఉన్నా.. డీజిల్ దొంగతానానికి గురవడం పట్ల వాహనదారులు, స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

● క్షణాల్లో వందల లీటర్ల డీజిల్ చోరీ

పార్క్ చేసిన వాహనాల నుంచి దొంగలు అత్యాధునిక యంత్రాలను ఉపయోగించి చోరీకి పాల్పడుతున్నారని వాహనదారులు, పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ దూరం వెళ్లే వాహనదారులు తప్పకుండా వాహనాల్లో డీజిల్ ట్యాంక్ ఫుల్ చేస్తుంటారు. అయితే, ఇలాంటి వాహనాలనే దొంగలు టార్గెట్ చేసుకుంటున్నారని, ఒక చిన్న మినీ వ్యానులో గానీ, లేదంటే చిన్న వాహనాల్లో వచ్చి సీసీ కెమెరాలకు సైతం చిక్కకుండా జాగ్రత్తలు తీసుకుంటూ డీజిల్‌ను దోచేస్తున్నారని, పోలీసులు ప్రత్యేకదృష్టి సారించాలని కోరుతున్నారు. ఇలాంటి దొంగలను పట్టుకుని వారిబారి నుంచి తమను కాపాడాలని పలువురు వాహనదారులతో పాటు దాబాల యాజమానులు కోరుతున్నారు.

● ఇదో పెద్ద దందా?

పార్కింగ్ చేసిన వాహనాల నుంచి డీజిల్ దొంగతనం చేసిన దొంగలు జాతీయ రహదారి పక్కనే ఉండే చిన్నచిన్న దుకాణాల్లో, పంక్చర్ దుకాణాల్లో తక్కువ ధరకు విక్రయిస్తున్నారని, ఇదొక పెద్ద దందా అని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇటీవలి కాలంలో డీజిల్ ధరలు పెరిగినప్పటి నుంచి రోడ్డు పక్కన ఉండే చిన్నచిన్న దుకణాల్లో, పలు పంక్చర్ దుకాణాల్లో డిజిల్ తక్కువ ధరకు లభిస్తుందని, వాహనాల నుంచి డీజిల్ దొంగతనం చేసి దానిని ఇలాంటి వాటిల్లో విక్రస్తున్నట్లు పలువురు వాహనదారులు అనుమానం వ్యక్తం చేస్తున్న పరిస్థితి ఉంది.

బోధన్‌వాసుల కల నెరవేరేనా?

● రైల్వేగేటు వద్ద ఫ్లైఓవర్ వంతెన నిర్మాణం అయ్యేనా? ● హామీలకే పరిమితం.. ఆచరణలో శూన్యం

ఆంధ్రజ్యోతి పరిశీలన



రైల్వేగేటు పడటంతో స్తంభించిన ట్రాఫిక్



బోధన్ రైల్వే స్టేషన్

బోధన్ రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బోధన్ పురప్రజల ఏళ్లనాటి కల.. ప్రజాప్రతినిధుల హామీలతో కలగానే మారింది. ప్రభుత్వాలు మారుతున్నాయి.. ఎన్నికల్లో గెలుపొందిన ప్రజాప్రతినిధులు హామీలను గుప్పించి మాటతో పురప్రజలను ఆనందింపజేస్తున్నారే తప్ప ఆచరణలో మాత్రం అమలు చేసిన పాపన పోవడం లేదు. ఇందుకు బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా ప్రాంతంలోని రైల్వేగేటు ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ పనులే నిదర్శనంగా చెప్పవచ్చు. ఎన్నో సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో వాహనదారులు, పురప్రజలు ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సైతం ప్రాణాలపైకి వచ్చి ట్రాఫిక్ అంతరాయం తొలగేంత వరకు వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. బోధన్-బాన్సువాడ ప్రధాన రహదారిపై ఉన్న రైల్వేగేటు చిన్నదిగా ఉండటంతో రైలు వచ్చి వెళ్లగానే సుమారు అరగంటకు పైగా ట్రాఫిక్ సమస్య నిత్యం ఉత్పన్నమవుతోంది. పురప్రజలే కాదు.. బోధన్ పట్టణానికి వచ్చి వెళ్లే ఇతర ప్రాంతాల ప్రజలు సైతం ఈ ప్రాంతం వద్దకు రాగానే జంకాల్సిన పరిస్థితి నెలకొంది. ఎందుకంటే ఎప్పుడు రైల్వేగేటు పడుతుందో.. ఎంతసేపు వేచి ఉండాలోనన్న భయాందోళన వాహనదారుల్లో, ప్రయాణికుల్లో నెలకొంది. కొన్ని సందర్భాల్లోనైతే అంబులెన్స్‌లు సైతం ట్రాఫిక్ సమస్య తప్పడం లేదు. అత్యవసర సేవలకు సైతం రైల్వేగేటు వద్ద ట్రాఫిక్ సమస్య తలపోటుగా మారిందంటున్నారు.

ఇరుకైన రైల్వే గేటు దారితో ఇబ్బందులు

బోధన్-బాన్సువాడ ప్రధాన రహదారిపై ఉన్న రైల్వేగేటు రోడ్డు ఇరుకుగా మారడంతో సమస్య తీవ్రతను ప్రజాప్రతినిధుల దృష్టి తీసుకెళ్లిన సందర్భాలు కోకొల్లాలు అని చెప్పడంలో ఏ మాత్రం సందేహం లేదు. గత కొన్ని సంవత్సరాలుగా మారుతున్న ప్రభుత్వాల ప్రజాప్రతినిధులకు ఈ సమస్యను విన్నవించగానే ఫ్లైఓవర్ వంతెన నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరిద్దాం అంటూ హామీలు ఇచ్చి చేతులు దులుపుకోవడం నాయకులకు పరిపాటిగా మారింది. రైల్వేబడ్జెట్ సమయంలో గళమెత్తుతున్న ఎంపీలు ఈ సమస్యపై మాత్రం గళమెత్తడంలో మెతకవైఖరిని ప్రదర్శిస్తున్నారు. దీంతో సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. జిల్లా ఎంపీ ధర్మపురి అరవింద్ ఫ్లైఓవర్ నిర్మాణం కోసం రైల్వేగేటు వద్ద వచ్చి వెళ్లారు తప్ప పనులకు నోచుకోలేదు.

అన్ని కార్యాలయాలు గేటుకు అవతలి వైపే..

బోధన్ పట్టణంలోని రాకాసిపేట ప్రాంతంలోనే డివిజన్ స్థాయి ప్రధాన కార్యాయాలు ఉన్నాయి. డివిజన్ అధికారి సబ్‌కలెక్టర్ కార్యాలయం, రోడ్లు భవనాల శాఖ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయం, రెవెన్యూ కార్యాలయం ఇలా చిన్న చితక కార్యాయాలన్ని రాకాసిపేట ప్రాంతంలోనే ఉన్నాయి. అంటే నవీపేట, రెంజల్, ఎడపల్లి, బోధన్ మండలాల ప్రాంతాల ప్రజలు ఈ కార్యాలయాలకు వెళ్లాలంటే రైల్వేగేటు దాటి వెళ్లాల్సి ఉంటుందంటున్నారు. అయితే ఎప్పుడు గూడ్స్ రైలు వస్తుందో? తెలియని పరిస్థితులు ఉండటంతో పాటు తెల్లవారుజామున 4.30 గంటల నుంచి ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి వరకు రైళ్ల రాకపోకలు జరుగుతూనే ఉన్నాయి. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రైల్వేగేటు ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టగా.. ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ పనులు సైతం చేపట్టకపోవడంతో ప్రజలు, వాహనదారులు, ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. ఇప్పటికైన పాలకులు ఇచ్చిన హామీకి కట్టుబడి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బస్సు సౌకర్యానికి నోచుకోని గొట్టిముక్కుల

● టోల్‌గేట్ నుంచి ట్రిప్‌కు లీటర్ డీజిల్ వృధా అయినా నో ప్రబ్లం ● గ్రామానికి మాత్రం ఒక్కట్రిప్ నడపలేరట ● బస్సులు రాక గ్రామస్థులకు తప్పని తిప్పలు ● గత కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

దోమకొండ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): 'దేవుడు వరం అందించిన పూజారి కరుణించడం లేదన్న చందంగా కామారెడ్డి ఆర్టీసీ ఉన్నతాధికారులకు సరిపోతుందేమో' అని మండలంలోని గొట్టిముక్కుల గ్రామ ప్రజలు చర్చించుకుంటున్నారు. గతంలో కలెక్టర్ సత్యనారాయణకు గొట్టిముక్కుల గ్రామస్థులు వినతిప్రతం అందజేయగా స్పందించిన కలెక్టర్ గొట్టిముక్కుల గ్రామం మీదుగా బస్సు నడపాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయతే, గ్రామంలో సుమారు 439 పైగా కుటుంబాలు, సుమారు 1300 జనాభా దోమకొండ మండలంలోని గొట్టిముక్కుల మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉంది. గ్రామంలో సుమారు 439 పైగా కుటుంబాలు, సుమారు 1300 జనాభా ఉంది. గ్రామం నుంచి ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు కామారెడ్డి జిల్లా కేంద్రం నుంచి ప్రజలు వివిధ పనులకై రాకపోకలు సాగిస్తుంటారు. అయిన కూడా గొట్టిముక్కులకు ఒక్క ట్రిప్ బస్సు సౌకార్యానికి నోచుకోవడం లేదు ఆ గ్రామస్థులు.



యాడారం నుంచి దోమకొండ బస్టాండ్‌కు చేరుకున్న బస్సు(ఫైల్)

కలెక్టర్ ఆదేశాలను తుంగలో తొక్కుతున్న ఆర్టీసీ

గతంలో కలెక్టర్ సత్యనారాయణకు గొట్టిముక్కుల గ్రామస్థులు తమ గ్రామం నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సు ట్రిప్‌లను నడపాలని వినతిపత్రం అందజేశారు. వెంటనే స్పందించిన అప్పటి కలెక్టర్ ఆర్టీసీ ఆధికారులకు ఆదేశాలను జారీ చేశారు. బస్సు ట్రిప్‌లను నడపాలని గొట్టిముక్కుల గ్రామానికి బస్ సౌకార్యం కల్పించి ప్రజల ఇబ్బందులు తొలగే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అయిన కూడా ఆర్టీసీ అధికారులు కలెక్టర్ ఆదేశాలను తుంగలో తొక్కారు.

టోల్‌గేట్ నుంచి బస్సులు నడపడం వల్ల డీజిల్ వృధా

కామారెడ్డి వైపు నుంచి దోమకొండ మీదుగా వివిధ రూట్‌లలో ఆర్టీసీ బస్సులు నడుస్తుంటాయి. అయితే అన్ని బస్సులు ఉదయం నుంచి సాయంత్రం వరకు చాలా ట్రిప్‌లు తిరుగుతుంటాయి.అందువలన బీటీఎస్ నుంచి కామారెడ్డి వైపు వేళ్లేందుకు బ్రిడ్జీ లేకపోవడం వలన రిటన్ హైదరాబాద్ వైపు వచ్చి బస్సులు టోల్‌గేట్ వద్ద మలుపు తీసుకుని కామారెడ్డి వెళ్తున్నాయి. దీంతో ఆర్టీసీకి డీజిల్ వృధా కావడంతో పాటు ఎపుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని ప్రయాణికులు భయందోళకు గురవుతున్నారు.

ఆదివారం వచ్చిందంటే ఆర్టీసీకి సెలవు!!

కామారెడ్డి నుంచి పెద్దమాల్లారెడ్డి నడుస్తున్న ఆర్టీసీ బస్సు ఉదయం సింగిల్ ట్రిప్(పెద్దమాల్లారెడ్డి నుంచి కామారెడ్డి వెళ్లేటపుడు స్కూల్ పిల్లలను తీసుకెళ్తుంది)సాయంత్రం కామారెడ్డి నుంచి పెద్దమాల్లారెడ్డి వైపు వెళ్లే ట్రిప్‌లో స్కూల్ పిల్లలను దింపి వెళ్తుంది. అయితే ప్రయాణీకులు బస్సును ఆపిన ఆపకుండా వెళ్తారని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. అంతేకాకుండా, కామారెడ్డి డిపోలో ఆర్టీసీ డీఎంలు మారితే బస్సులను శాటిజ్ చేస్తున్నారు. సుమారు 20 సంవత్సరాల నుంచి మాల్కాపూర్, యాడారం, తూజాల్‌పూర్, మాందాపూర్, పెద్దమాల్లారెడ్డి నైట్‌హాల్ట్ బస్సులు నడుస్తుండేవి. అయితే కొన్ని నెలల నుంచి ఆర్టీసీ డీఎంలు మారగానే బస్సులను కొన్ని రూట్లలో నైట్‌హాల్ట్ బస్సులను బంద్ చేశారు. అదేంటో ఎమోకానీ అధికారులు వారికి నచ్చినట్టు ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తూ, ప్రభుత్వానికి సైతం చెడ్డ పేరును తెస్తున్నారు.

గతంలో మాదిరి షటిల్ బస్సును నడపాలి

గత 20 సంవత్సరాల నుంచి కామారెడ్డి నుంచి క్యాసంపల్లి, చింతమాన్‌పల్లి, ముత్యంపేట, దోమకొండ, గొట్టిముక్కుల వరకు ఆర్టీసీ శాటిల్ బస్సును అధికారులు నడిపిస్తుండేవారు. కానీ గత మూడు సంవత్సరాలుగా గొట్టిముక్కులకు ఒక ట్రిప్ బస్సు నడపడం లేదని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. టోల్‌గేట్ నుంచి రిటన్‌లో తిప్పుతూ అన్ని బస్సులను నడిపితే హృదా కానీ డీజిల్ ఒక ట్రిప్ గొట్టిముక్కుల మీదుగా నడిపితే బీజిల్ హృదా అవుతుందా అని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

గొట్టిముక్కులకు రావాలంటే జంకుతున్న బంధువులు

గొట్టిముక్కుల గ్రామానికి బస్సు సౌకార్యం లేకపోవడంతో గ్రామానికి పిల్లను ఇవ్వలంటే కూడా ముందుకు రావడం లేదు. మండల కేంద్రానికి పక్కనే ఉన్నప్పటికి బస్సు రాకపోవడంతో పలువురు ముక్కున వేలసుకుంటున్నారు. బంధువులు సైతం గ్రామానికి రావలంటే రావడం లేదని గ్రామస్థులు ఆర్టీసీ అధికారులపై అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, గతంలోనే మాదిరిగానే ముత్యంపేట, గొట్టిముక్కుల శాటిల్ బస్సును నడిపితే ఉదయం వేళల్లో కామారెడ్డి కళాశాలకు వెళ్లే విద్యార్థులు గొట్టిముక్కుల, దోమకొండ, ముత్యంపేట, చింతమాన్‌పల్లి, క్యాసంపల్లి గ్రామాల నుంచి వెళ్లాడానికి అనువుగా ఉంటుంది. తిరిగి సాయంత్రం సమయంలో శాటిల్ బస్సు నడపాలని ఆయా గ్రామాల ప్రజలు జిల్లా కలెక్టర్‌ను కొరుతున్నారు.

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో షబ్బీర్ అలీ



రాహుల్‌గాంధీ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న షబ్బీర్ అలీ, కేశవేణు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో నాందేడ్‌లో ఎన్నికల ప్రచారంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, జహిరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నుడా ఛైర్మన్ కేశవేణులు పాల్గొన్నారు. గురువారం నాందేడ్‌లో లోక్‌సభ పక్ష నాయకుడు రాహుల్‌గాంధీ సభ నేపథ్యంలో అక్కడ సభ ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించినట్లుగానే మహారాష్ట్రలోనూ కాంగ్రెస్ పార్టీ కూటమి విజయం సాధిస్తుందని షబ్బీర్ అలీ విశ్వాసం వ్యక్తం చేశారు.

హాస్టళ్లను తనిఖీ చేసిన తహసీల్దార్

సిరికొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల హాస్టల్, ఎస్సీ హాస్టల్, మోడల్ స్కూల్ హాస్టళ్లను సిరికొండ తహసీల్దార్ రవీందర్‌రావు బుధవారం తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఆదేశాల మేరకు హాస్టళ్లను తహసీల్దార్ తనిఖీ చేశారు. కిచెన్ రూమ్‌లోని కూరగాయలను, వంట చేసిన భోజనాలను పరిశీలించారు. వార్డెన్‌ల, విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. తనిఖీ అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని వార్డెన్‌లకు సూచించారు. పౌష్టికా హారం అందించాలని ఆకు కూరలు, కూరగాయలు పిల్లలకు అందిం చాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట ఆర్‌ఐ గంగరాజం ఉన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన వారికి జైలు

ఖిల్లా, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపిన వారిని బుధవారం ఉదయం కోర్టు మెజిస్ట్రేట్ ఎదుట ముగ్గురు వ్యక్తులను హాజరుపర్చగా ఒక్కొక్కరికి మూడు రోజుల పాటు జైలు శిక్షతో పాటు రూ.8వేల జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వీరయ్య తెలిపారు. వాహనాల తనిఖీల్లో భాగంగా మద్యం తాగి వాహనం నడిపిన వారిని గుర్తించి కౌన్సిలింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. ప్రజలు మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష అనుభవించాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

కల్లూరులో రైతుల రాస్తారోకో



కల్లూరులో రాస్తారోకో చేస్తున్న రైతులు

కోటగిరి,నవంబరు13(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కొనుగోలు చేయడంలో అటు పాలకులు, ఇటు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై రైతులు ఆగ్రహం చేస్తున్నారు. పొతంగల్ మండలంలోని కల్లూరు గ్రామంలో బుధవారం ధాన్యం కొనుగోళ్లలో జాప్యంపై రాస్తారోకో నిర్వహించారు. ప్రధాన రహదారిపై వాహనాలను అడ్డంగా పెట్టి రోడ్డుపై బైఠాయించారు. కొనుగోలు కేంద్రం ప్రారంభించి వారం రోజులు కావస్తున్న ఇంత వరకు గోనే సంచులు లేక కొనుగోలు చేయడం లేదన్నారు. గన్నీ బ్యాగుల కొరతను తీర్చాలని రైతులు డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని వాపోయారు. జిల్లా సహకార సంఘం అధికారితో ఫోన్‌లో మాట్లాడించడంతో రైతులు శాంతించారు. ఈ కార్యక్రమంలో రైతులు బాలయ్య, పోచయ్య, భాస్కర్, లస్మయ్య, బాలాజీ, బీరుగొండ, మాధవ రెడ్డి, దేవేందర్, రాజు, లింగం, రాములు తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికి తీసేలా బాలోత్సవం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేలా బాలోత్సవం నిర్వహించడం గొప్ప విషయమని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. మండలంలోని రాణాకుర్తి గ్రామ సమీపంలో ఉన్న ప్రెసిడెన్సి పాఠశాలలో నిర్వహిస్తున్న నిజామాబాద్ బాలోత్సవం చదువుల పండుగ ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుత పోటీ ప్రపంచంలో మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా కొత్త కొత్త ఆవిష్కరణలు చేయడం గొప్ప విషయమన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేలా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో జనవిజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు కృష్ణారావు, ప్రతినిధులు నర్ర రామారావు, రామ్మోహన్‌రావు, పాఠశాల ప్రిన్సిపల్ పవన్‌కుమార్, జయని నెహ్రూ, ఏఎంసీ ఛైర్మన్ ముప్పగంగారెడ్డి, పిసిసి డెలిగేట్ చంద్రశేఖర్‌గౌడ్, పార్టీ అధ్యక్షుడు సాయరెడ్డి, బాడ్సి సొసైటీ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చలేదు: ఎంపీ



రైతులతో మాట్లాడుతున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

డిచ్‌పల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్న ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఎంపీ ధర్మపురి అర్వింద్ విమర్శించారు. బుధవారం ఇందల్వాయి మండలం గన్నారం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీ ధర్మపురి అర్వింద్ నిజామాబాద్ పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు లాగా పని చేస్తారని అనుకుంటే కేసీఆర్ శిష్యుడిలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతులకు చేస్తున్న సంక్షేమాన్ని రేవంత్‌రెడ్డి గుర్తించి ఇక్కడి రైతులకు అలాంటి న్యాయం చేయాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే 4 వేల పింఛను, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఏవరికైన ఇంత వరకు ఇచ్చారా అని ప్రశ్నించాం. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం నెలల తరబడి ఎందుకు కొనుగోలు చేయడం లేదని ఎంపీ ప్రశ్నించారు. రైతులకు ఇచ్చిన హామీలు పూర్తి స్థాయిలో అమలు పర్చాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యం తక్షణమే కొనుగోళ్లు ప్రారంభించాలన్నారు. కేటీఆర్ ఢిల్లీలో అడుగు పెట్టిన వెంటనే తెలంగాణలో ప్రకంపనలు మొదలయ్యాయని కొందరు, నేతలు, కొన్ని పత్రికలు తమ సొంత మీడియా కథనాలు వెల్లడించాయని అన్నారు. కానీ కేటీఆర్ ఢిల్లీలో ఎవరిని కలిసారో ఇప్పటి వరకు ఫొటోలు గాని వీడియోలు గాని బహిర్గతం చేయలేదన్నారు. ఎంపీ వెంట నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులచారి, పల్లె గంగారెడ్డి, కోరుట్ల బీజేపీ నాయకురాలు అనిత తదితరులు ఉన్నారు.

ప్రభుత్వంపై ప్రతిపక్షాల ఆరోపణలు సిగ్గుచేటు

● కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న మానాల మోహన్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకుంటున్న సందర్భంగా విజయోత్సవాలు నిర్వహించడంపై బిజెపి, బిఆర్ఎస్ నాయకులు తోకకాలిన కోతుల్లాగా మాట్లాడటం సిగ్గుచేటని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు కాగా అందులో మూడు నెలలు పార్లమెంట్ ఎన్నికలకే పోగా మిగిలిన ఎనిమిది నెలల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేశామన్నారు. మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత కరెంటు, 2లక్షలలోపు రుణమాఫీ, ఉచిత సిలిండర్, ఆరోగ్యశ్రీని 10లక్షలకు పెంచడం వంటి అనేక హామీలను నెరవేర్చామని మిగిలిన వాటిని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. రుణమాఫీతో పాటు రైతుబంధు విషయంలో ప్రభుత్వం ప్రణాళిక పరంగా ముందుకు వెళ్తుందని ఆయన అన్నారు. గతంలో పదేళ్ల అధికారంలో ఉన్న బిఆర్ఎస్ లక్ష రుణమాఫీ కూడా చేయలేదని, రైతుబంధు పేరుతో అనర్హులకు ప్రజాధనాన్ని ఇచ్చారని అలా కాకుండా అర్హులకు రైతుబంధు ఇచ్చేలా ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తుందని అందువల్లే ఆలస్యమవుతుందన్నారు. ఇది రైతులు గ్రహించారని కేవలం బిఆర్ఎస్, బిజెపి నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారని అన్నారు. కెసిఆర్ ఫామ్‌హౌజ్‌కే పరిమితం కాగా కెటిఆర్, హరీష్‌రావులు ఇష్టం వచ్చినట్లు అబద్దాలు మాట్లాడుతున్నారని జిల్లాలో బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి, బిజెపి ఎంపీ అర్వింద్ పసలేని ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ప్రశాంత్‌రెడ్డి జిల్లాకు ఏం చేశాడో చెప్పాలని కనీసం పేదలకు డబుల్‌బెడ్‌రూం ఇండ్లు కూడా ఇవ్వలేదని గత ఏడాది అకాల వర్షాల వల్ల జిల్లాలో వంద కోట్ల నష్టం జరిగితే ప్రభుత్వం నుంచి మంత్రిగా ఏం నిధులు తెచ్చారో చెప్పాలన్నారు. కేంద్రం నుంచి ఎంపీ అర్వింద్ తెచ్చిన నిధులు ఏమిటో చెప్పాలన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీ కడుతూనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి ఒక్క హామీ నెరవేర్చేందుకు కృషి చేస్తుంటే ప్రతిపక్షాలకు కడుపు మంటగా ఉందన్నారు. ఖచ్చితంగా కాంగ్రెస్ పార్టీ విజయోత్సవాలు చేసుకుంటుందని ఆయన అన్నారు. ఈ సమావేశంలో గ్రంథాలయ ఛైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి, నరేందర్‌గౌడ్, పంచరెడ్డి చరణ్, వైసాక్షి సంతోష్, గడుగు రోహిత్, వినయ్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 57వ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): 57వ జిల్లా గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నుంచి జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రారంభం కాను న్నాయి. వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించనున్నారు. 14న మధ్యాహ్నం 1 నుంచి 6వ తరగతి విద్యార్థులకు జ్ఞాపక శక్తి పోటీలు నిర్వహి ంచనున్నారు. 15న 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఉదయం 11గంటలకు వ్యాస రచన పోటీలు, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు మధ్యాహ్నం 2గంటలకు వ్యాస రచన పోటీలు జరుగనున్నాయి. 16వ తేదీన ఉదయం 10గంటలకు 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు జనరల్‌నాలెడ్జ్, 17న 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2గంటలకు చిత్రలేఖనం పోటీలు, 18న ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులకు ఉదయం 10గంటలకు ఉపన్యాస పోటీలు, పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థులకు మధ్యాహ్న 2గంటలకు పాటల పోటీలు నిర్వహించనున్నారు. 19న హైస్కూల్, కళాశాల విద్యార్థినిలకు ఉదయం మెహందీ పోటీలు జరుగనున్నాయి. 20వ తేదీన సాయంత్రం 4గంటలకు న్యూ అంబేద్కర్ భవన్‌లో ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు, బహుమతులు ప్రదానం జరుగనుంది.

కల్లుసీసాలో బల్లి కలకలం



కల్లుసీసాలో బల్లి

రెంజల్,నవంబరు13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కల్లుబట్టిలో కల్లు తాగేందుకు వెళ్లిన వ్యక్తికి కల్లు సీసాలో బల్లిని గమనించిన వ్యక్తి ఆ కల్లు తాగాడు. కల్లు తాగిన కొద్దిసేపటికే కల్లు సీసాను పరిశీలించడంతో అందులో చనిపోయిన బల్లి కనిపించడంలో వ్యక్తి షాక్‌కు గురయ్యాడు. బల్లి ఉన్న కల్లును తాగడంతో కొద్దిసేపటికే వాంతులు అవ్వడంతో వ్యక్తి అవస్థకు గురయ్యాడు. గమనించిన స్థానికులు కల్లుబట్టి యాజమానిపై ఆగ్రహం వ్యక్తం చేసి వీరంగం సృష్టించారు. స్థానికుల సహాయంతో ఆ వ్యక్తికి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. స్వచ్ఛమైన కల్లు విక్రయించే కల్లుబట్టిల్లో సీసాలను కడగకుండా కల్లు నింపడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఎక్సైజ్ శాఖ అధికారులు మాముళ్లకు అలవాటు పడడంతో కల్తీ కల్లు రాజ్యమేలుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భూ వివాదంలో ఇద్దరి మధ్య తగాదా

సిరికొండ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):గోప్యానాయక్ గ్రామ పంచాయతీ పరిధిలోని చిన్యానాయక్ తండాకు చెందిన అజ్మీర జీవన్, అజ్మీర బాలుల మధ్య భూ విషయంలో గొడవ పడ్డారు. కర్రలతో ఇరువురు వ్యక్తులు కొట్టుకొని ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారని ఎస్సై ఎల్.రాం తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు అజ్మీర జీవన్, అజ్మీర బాలు, డప్పు రవి, అజ్మీర వినోద్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలికల ఛాంపియన్‌గా నిజామాబాద్



మాట్లాడుతున్న తాహెర్‌బిన్ హందాన్

సుభాష్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):ఎస్‌జిఎఫ్ అండర్-17 బాలికల ఛాంపియన్‌గా నిజామాబాద్ జట్టు నిలిచింది. లీగ్ దశ నుంచి నిజామాబాద్ జిల్లా జట్టు బాలికలు విజయం సాధిస్తూ ఛాంపియన్‌గా నిలిచారు. ఫైనల్‌లో మహబూబ్‌నగర్ జట్టుపై 2-0తో గెలిచి జిల్లాను ఛాంపియన్‌గా నిలబెట్టారు. ద్వితీయ స్థానంలో మహబూబ్‌నగర్ జట్టు, తృతీయ స్థానంలో నల్గొండ జట్టు నిలిచాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉర్దూ అకాడమి ఛైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడలు ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమీషన్ మెంబర్ గడుగు గంగాధర్, పేటా సంఘం జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య, ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ నాగమణి, వ్యాయామ ఉపాధ్యాయుడు గోపి రెడ్డి, ఎస్‌జిఎస్ యాజమాన్యం సంతోష్, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌పీజీ గ్యాస్‌పై విద్యార్థులకు అవగాహన

ధర్పల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):ఎల్‌పీజీ వంట గ్యాస్‌పై విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోగల రత్న ఇండెన్ గ్యాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండెన్ గ్యాస్ ప్రొప్రైటర్ శేఖర్ మాట్లాడుతూ వంట గ్యాస్ వినియోగం, పొదుపు, గ్యాస్ లీక్ అయినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర వాటిపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీకాంత్, ప్రధానోపాధ్యాయురాలు సాధన, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన గడుగు గంగాధర్

నిజామాబాద్ అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమీషన్ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన గడుగు గంగాధర్ బుధవారం జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతును మర్యాదపూర్వకంగా కలిశారు.రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి, రత్నాకర్, తదితరులు సన్మానించారు.

నేడు జిల్లాకు రానున్న ఇన్‌చార్జి మంత్రి

నిజామాబాద్ అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు గురువారం జిల్లాకు రానున్నారు. ఉదయం 7గంటలకు హైదరాబాద్ నుంచి బయలుదేరి 10గంటలకు డిచ్‌పల్లి మండలంలోని పలు ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించనున్నారు. అనంతరం ఆర్మూర్ నియోజకవర్గంలో, ఎడపల్లి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించనున్నారు. మధ్యాహ్నం 2గంటలకు జిల్లా కలెక్టరేట్‌లో ధాన్యం కొనుగోలు, ఇతర అంశాలపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

● నేడు డిచ్‌పల్లిలో మంత్రి జూపల్లి పర్యటన

డిచ్‌పల్లి:నేడు డిచ్‌పల్లి మండలంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణరావు పర్యటించనున్నారు. మెంట్రాజ్‌పల్లి గ్రామంలో రైతు వేదిక వద్ద రైతులతో మాట్లాడుతారని కలెక్టర్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. రైతులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని, ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి హాజరవుతున్నారని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్‌తెలిపారు.

డిగ్రీ రీవాల్యుయేషన్ నోటిఫికేషన్ విడుదల

డిచ్‌పల్లి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి):టీయూ పరిధిలోని డిగ్రీ రివాల్యూయేసన్ నోటిఫికేషన్ బుధవారం విడుదల చేశారు. ఈ దిగువ కోర్సులు 1,2,3,4,5,6 వ సీబీసీఎస్ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ వైడబ్ల్యూఎస్ 1,2,3వ ఓస్టీ బ్యాక్‌లాగ్ జూలై ఆగస్టు 2024 పరీక్షలకు హాజరైన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ఒక్కో పేపర్‌కు రూ.500 రివాల్యూయేషన్, ఫారం రూ.25 చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తుకు చివరి తేది నవం బరు 23ని సీవోఈ ప్రొ.అరుణ తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్ సైట్ సంప్రదించలన్నారు.

● డిగ్రీ టైం టేబుల్ సవరణ

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ విద్యార్థులకు సవరణతో టైం టెబుల్ విడుదల చేసినట్లు సీవోఈ అరుణ తెలిపారు. కోర్సులు సీబీసీఎస్ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ, 1,3,5 వ సెమిస్టర్ రెగ్యులర్, 2,4,6 బ్యాక్‌లగ్ 2020-2023 బ్యాచ్ విద్యార్థులకు మాత్రమే ఆవకాశం కల్పించమన్నారు. ఈ పరీక్షలు నవంబరు 24న ఉండగా నవంబరు 26 కు పొడిగించడం జరిగిందని, సీవోఈ అరుణ తెలిపారు. పూర్తి వివరాలకు వెబ్ సైట్ సంప్రదించలన్నారు.

మొదలైన యాసంగి సాగు

(ఐదో పేజీ తరువాయి)

రైతులతో పాటు ఇతర రైతులు కూడా తీసుకునే అవకాశం ఉండటం వల్ల ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో పంట రుణాలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని లీడ్‌బ్యాంక్‌మేనేజర్ అశోక్‌చౌహాన్ తెలిపారు. యాసంగి రుణాలను ఈనెల నుంచి ఫిబ్రవరి వరకు అందిస్తామన్నారు. రైతులు వేసే పంటల ఆధారంగా రుణపంపిణీ చేస్తామని తెలిపారు. ఈ రుణాలపై అన్నిబ్యాంకులకు లక్ష్యాలను నిర్ణయించామని ఆయన తెలి పారు.

దొంగ.. దొంగ!

(ఐదో పేజీ తరువాయి)

చోట దుండగులు యథేచ్ఛగా చోరీలకు పాల్ప డుతూ అందినకాడికి దోచుకుంటున్నారు.

నిదురపోతున్న నిఘా విభాగం!

జిల్లాలో నిఘా విభాగం నిదురపోతుందనే అనుమానాలు కలుగుతున్నాయి. పోలీసు శాఖలో ప్రత్యేకంగా ఉండే నిఘా విభాగం అన్ని రకాలుగా విఫలమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా లో వరుస దొంగతనాలు జరుగుతున్నా నిఘా విభాగం స్పందించకపోవడంతో ప్రజల్లో ఆ విభాగంపై నమ్మకం పోతుందనే భావన కలుగుతోంది. పోలీసు శాఖలో ప్రత్యేకంగా ఉన్న నిఘా విభాగంలో ఎస్సై స్థాయి అధికారి నుంచి ఏసీపీ స్థాయి అధికారి వరకు విధులు నిర్వర్తిస్తుంటారు. కానీ వారు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసు కోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. గతంలో జిల్లా కేంద్రంలో ఉగ్ర కార్యకలాపాలను నిర్వహించిన వారిని సైతం వారు గుర్తించలేకపోయారు. ప్రస్తుతం జరుగుతున్న దొంగతనాల విషయంలోనూ ఏఏ వర్గం దొంగతనాలకు పాల్పడుతోంది, ఎక్కడి నుంచి వచ్చారు, తదితర వివరాలను ఆరా తీయడంలో ఆ శాఖ పూర్తిగా విఫలమైందని పలువురు చర్చించుకుంటున్నారు. జిల్లాలో ఎక్కడ ఏ ఘటన జరిగినా పోలీసు ఉన్నతాధికారులకు తెలియచేయడానికి ప్రత్యేకంగా నిఘా విభాగం ఉన్నా.. ఫలితం లేకుండా పోతోందని భా విస్తున్నారు. అలాగే జిల్లా పోలీసు కమిషనర్ బదిలీ అయినా.. ఇప్పటి వరకు ఇన్‌చార్జీ సీపీతోనే కొనసాగించడం వల్ల కూడా కింది స్థాయి అధికారులుసక్రమంగా విధులు నిర్వహించలేక పోతున్నారనే చర్చజరుగుతోంది.

సంచులకు.. సంచులే!

(ఐదో పేజీ తరువాయి)

బియ్యం పట్టుబడటం వెనుక సిండికేట్‌లో ఏర్పడిన తగాదాలే పోలీసులకు సమాచారం ఇస్తున్నారనే వాదనలు ఉన్నాయి. పోలీసులు సైతం గతంలో కంటే ఎక్కువ ఉత్సాహంతో రేషన్ బియ్యాన్ని పట్టుకుంటున్నారు. పీడీఎస్ మాఫియాతో చేట్టాపట్టాలు వేసుకొని తిరిగిన పోలీసులు ఇప్పుడు తమకు నెలవారి రావాల్సిన మామూళ్లు అందడం లేదనే కారణాలతో ఎక్కడ పడితే అక్కడ దాడులు నిర్వహించడం విమర్శలకు తావిస్తుంది. ఇప్పటికైనా జిల్లా పౌరసరఫరాల అధికారులు పిడిఎస్ బియ్యం పక్కదారి పట్టడంపై దృష్టిపెట్టి కట్టడి చేస్తే తప్ప పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం అందే పరిస్థితి కనిపించడం లేదు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్ ఫెస్టివల్‌లో పాల్గొన్న విద్యార్థులు

నిజామాబాద్ అర్బన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి):నగరంలోని వర్ని రోడ్‌లోగల సేయింట్ జెవియర్స్ పాఠశాలలో చిల్డ్రన్స్‌డే సందర్భంగా బుధవారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకుంది. పాఠశాలకు చెందిన వివిధ తరగతుల విద్యార్థులు ఈ ఫుడ్ కార్నివాల్‌లో పాల్గొన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టిక ఆహారం ఎలా ఉంటుందో తెలియజేసే విధంగా పాఠశాల ఉపాధ్యాయురాళ్లు స్వయంగా వంట చేసిన వంటకాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ లతాగౌడ్, ఛైర్మన్ నర్సింహాగౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

దాడి చేసిన సెక్యూరిటీపై చర్యలు తీసుకోవాలి

డిచ్‌పల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ విద్యార్థి పరిసత్ వర్సిటీ అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ.. ట్రిపుల్ ఐటీ బాసర రెండో సంవత్సరం చదువుతున్న స్వాతి ప్రియ ఆత్మహత్యకు ఏన్నో అనుమానాలు ఉన్నాయని, ప్రశ్నించిన ఏబీవీపీ నాయకులపై దాడి చేసిన సెక్యూరిటీ ఆఫీసర్ రాకేశ్ మరికొంత మంది సిబ్బంది పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ప్రతినిధులు అమృత్‌చారి, సమీర్, మోహన్,అక్షయ్, లెనిన్, సాయినాథ్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.


చికెన్ ధరలు





రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.265	రూ. 285
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.270	రూ. 290

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.78100	రూ.72050	రూ.940

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్
స్క్రీన్-1 : కంగువా (3డి తెలుగు) (9.30, 12.50, 4.10, 7.30, 10.50)
స్క్రీన్-2 : మట్కా(12.10, 3.35, 7.00, 10.25)
స్క్రీన్-3 : అమరన్ (9.50)
: సింగం అగేన్ (హిందీ) (1.20)
: లక్కీభాస్కర్ (4.30, 7.45, 11.00)
స్క్రీన్-4 : బూల్ బులియా-3 (హిందీ) (12.35)
: క (4.00)
: అమరన్ (7.50, 10.45)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..
స్క్రీన్-1 : మట్కా (10.25, 4.35, 10.40)
: లక్కీభాస్కర్ (1.40, 7.35)
స్క్రీన్-3 : అమరన్ (1.25, 7.25)



దేవి : మట్కా(11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : అమరన్ (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : కంగువా (3డి తెలుగు) (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్: దేవర (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్